

సల్లంగ చూడు తల్లీ..
చిరుమళ్ల సమ్మక్క జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. చర్లలోని ఎదిరిగుట్టల జాతర శుక్రవారంతో ముగిసింది. 8లో

'తపాలా' పరిమితుల పెంపు
కేంద్రం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ప్రజలకు తపాలా పథకాల ద్వారా మరింత లాభం చేకూరనుంది. 10లో

గరిష్టం / కనిష్టం
35° / 18°

వాతావరణం
జిల్లాలో శనివారం కొంతమేర ఎండ ప్రభావం ఉంటుంది. రాత్రి వేళ చలి తీవ్రత తక్కువగా ఉండవచ్చు.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య..



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలో మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సహస్ర కలశాభిషేకానికి అంకురార్పణ



గోదావరి జలం తీసుకొస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మాఘమాసంలో జరిగే సహస్రకలశాభిషేకోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మేళతాళాల నడుమ అర్చకులు పవిత్ర గోదావరి నుంచి నదీ జలాలను తీసుకొచ్చి ఉత్సవాలను ప్రారంభించారు. శనివారం కలశావాహనం, ఆదివారం సహస్ర కలశాభిషేకోత్సవం జరపనున్నారు. కాగా శని, ఆదివారాల్లో నిత్యకల్యాణాలను నిలిపివేశారు.

ఉపాధ్యాయుల వివరాలు జాగ్రత్తగా పరిశీలించాలి



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్

కొత్తగూడెంఅర్బన్: బదిలీ దరఖాస్తు చేసిన ప్రతి ఉపాధ్యాయుడి వివరాలు జాగ్రత్తగా పరిశీలించాలని డీఈఓ ఎస్‌ఎస్‌ఎస్.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయానికి బదిలీ దరఖాస్తుల హార్డ్ కాపీలతో మండల విద్యాధికారులను, కోఆర్డినేటర్లను పిలిపించి మాట్లాడారు. ప్రిఫరెన్షియల్ కేటగి రీల అప్లికేషన్లను, పీహెచ్‌సీ అప్లికేషన్లను, మెడికల్‌కి సంబంధించిన అప్లికేషన్లను ప్రత్యేకంగా డీఈఓ తనిఖీ చేశారు. జనరల్ అప్లికేషన్లను కూడా మండలాల వారీగా వెరిఫై చేయించి అప్రూవల్ చేయించారు. ఖాళీల వివరాలు కూడా మండలాల వారీగా మరొకసారి వెరిఫై చేసి మండల విద్యాధికారుల సైన్డ్ కాపీలు తీసుకొని అన్ని ఖాళీలను అప్లోడ్ చేసినట్లు వివరించారు.

పరీక్షలకు సిద్ధం చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఐఈఓ సులోచనారాణి

దుమ్ముగూడెం: ఇంటర్మీడియట్ విద్యార్థులను మార్చిలో జరిగే వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలి డీఐఈఓ బి.సులోచనా రాణి సూచించారు. శుక్రవారం ఆమె దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. కళాశాలలో నిర్వహిస్తున్న ఎంసెట్ క్లాసులను, బయోమెట్రిక్ హాజరు వివరాలను పరిశీలించారు. త్వరలో జరగనున్న ప్రాక్టికల్ పరీక్షలపై ప్రిన్సిపాల్, సైన్స్ అధ్యాపకులకు పలు సూచనలు చేసి, మాట్లాడారు. ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బొట్టుబొట్టు ఒడిసి పట్టి..



రంగాపురం వద్ద కిన్నెరసాని వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్‌లో జలకళ



పంటలకు సాగునీరందించేలా చర్యలు

- రూ.101 కోట్లతో 52 చెక్ డ్యామ్‌ల నిర్మాణం
- భూగర్భ జలాలు పెంపొంది సత్ఫలితాలు..
- రూ.33 కోట్లతో మరో ఏడింటికి ప్రతిపాదనలు

పాల్వంచరూరల్: జిల్లాలో వర్షాధార పంటల సాగే ఎక్కువగా ఉంది. చెక్ డ్యామ్‌లు, చెరువుల ద్వారా రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇప్పటికే పలుచోట్ల జలవనరుల శాఖ ఆధ్వర్యంలో చెక్ డ్యామ్‌లు నిర్మించి భూగర్భ జలాలు పెంపొందించారు. దీంతో ఆయకట్టు రైతులకు ఎంతో ఉపయోగం జరుగుతోంది. ఇదే క్రమంలో మరికొన్ని చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి అధికారులు ఉపక్రమించారు. వర్షపు నీరు వాగుల ద్వారా వృథాగా పోకుండా నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించి, సాగునీటి అవసరాలకు ఉపయోగపడే విధంగా రూ.33 కోట్లతో నూతన చెక్ డ్యామ్‌ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

కొత్తగా ఏడు చెక్ డ్యామ్‌లు..

తెలంగాణ వచ్చాక ప్రభుత్వం సాగునీటి రంగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఆకాశం నుంచి రాలిపడిన వానబొట్టును ఒడుపుగా పట్టుకుని భూగర్భ జలాలు పెంచేలా చర్యలు తీసుకుంటోంది. ముందుగా పాత చెరువులను మిషన కాకతీయ ద్వారా పునరుద్ధరించగా, ఆ తర్వాత దశలో కాళేశ్వరం, సీతారామా వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులను చేపట్టింది. ఇప్పుడు వాగుల్లో పారే నీటిని పంట పొలాలకు మళ్లించేందుకు జలవనరుల శాఖ ఆధ్వర్యంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపడుతోంది. జిల్లాలో మొదటి విడతలో 52 చెక్‌డ్యామ్‌లు మంజూరయ్యాయి. ఇందులో కొన్ని చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పూర్తవగా మరికొన్ని వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. కాగా ఇటీవల జిల్లా వ్యాప్తంగా ఉన్న వాగులు, అందులో నీటి లభ్యత ఆధారంగా మరో మూడు వాగులపై కొత్తగా ఏడు చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల్లో ప్రవహిస్తున్న ముర్రేడు, ఏదులవాగు, రాళ్లవాగు మీద రూ.33 కోట్ల వ్యయంతో వీటిని నిర్మించనున్నారు. పోలవరం ముంపు ప్రభావం, సీతారామ ఫ్లడ్ బండ్ పనుల కారణంగా ఇక పినపాక, భద్రాచలం నియోజకవర్గాల పరిధిలో వాగులకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ప్రతిపాదిత చెక్‌డ్యామ్‌ల వివరాలు

వాగు	స్థలం	వ్యయం (రూ.కోట్లలో)	సాగు (ఎకరాల్లో)
రాళ్లవాగు	సారెకల్లు (పాల్వంచ)	2.18	150
ముర్రేడు	ఎర్రగుంట (పాల్వంచ)	5.83	200
ముర్రేడు	తోగ్గూడెం (పాల్వంచ)	5.28	200
ముర్రేడు	పెనుబల్లి (లక్ష్మీదేవిపల్లి)	5.20	200
ఏదులవాగు	గొల్లగూడెం(సుజాతనగర్)	4.01	200
ఏదులవాగు	మల్లబంజర (సుజాతనగర్)	4.10	250
ఏదులవాగు	లక్ష్మీదేవిపల్లి	5.78	250

వేసవిలోనూ జలకళ..

జిల్లాలోని పలు మండలాల పరిధిలో వాగుల ద్వారా వృథాగాపోతున్న నీటిని నిల్వచేసేందుకు చెక్ డ్యామ్‌లు నిర్మించారు. నిర్మాణం పూర్తయిన చెక్ డ్యామ్‌లు వర్షపు నీటితో నిండి జలకళ సంతరించుకున్నాయి. మూడేళ్ల కిందట నాబార్డు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 52 చెక్ డ్యామ్‌ల నిర్మాణాన్ని రూ.101 కోట్ల వ్యయంతో చేపట్టారు. ఇందులో చాలా చెక్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తవగా మరికొన్ని చివరి దశకు చేరుకున్నాయి. చెక్‌డ్యామ్‌ల కారణంగా వర్షాలు లేని సీజన్‌లోనూ వాగుల్లో నీరు దర్శనమిస్తోంది. ఫలితంగా చెక్‌డ్యామ్‌లకు సమీపంలో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. వేసవిలో కూడా ఆయా చెక్ డ్యామ్‌లు నీటితో నిండి పొంగిపొర్లుతున్నాయి. ఎండాకాలంలో వ్యవసాయ పంటల అవసరాలకు సాగునీరు అందడమేగాకుండా, భూగర్భజలాలు పెరిగి బోర్లు, వ్యవసాయ బావుల్లో నీటి ఎద్దడి లేకుండా రెండు పంటలకు సాగునీరు అందే అవకాశం ఉంది.

ప్రతిపాదనలు సిద్ధం చేశాం..



జిల్లాలో వాగుల ద్వారా వృథాగా పోతున్న నీటిని నిల్వచేసి, పంటలకు వినియోగించుకునేలా ప్రణాళికాబద్ధంగా గతంలో కిన్నెరసాని, ముర్రేడువాగులపై 52 చెక్ డ్యామ్‌లను నిర్మించాం. నూతనంగా రూ.33.39 కోట్ల అంచనా వ్యయంతో 1,450 ఎకరాలకు ఆయకట్టుకు సాగునీరందేలాల మరో ఏడు చెక్ డ్యామ్‌ల నిర్మించాలని నిర్ణయించాం. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

–బి.అర్జున్, జలవనరులశాఖ ఈఈ

'ఉపాధి'కి ఆధార్ అనుసంధానం..





ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్) (ఇన్‌సెట్) ఉపాధి కూలీల జాబ్‌కార్డులు ఆధార్‌తో అనుసంధానం చేస్తున్న అధికారులు

- ఈ నెల నుంచే ఆధార్ అనుబంధ చెల్లింపులు
- జిల్లాలో 96 శాతం పూర్తయిన అథెంటికేషన్ ప్రక్రియ
- అనుసంధానం కాకపోతే వేతన చెల్లింపులు బంద్

చుంచుపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఉపాధి కూలీల హాజరు నమోదుకు ఇప్పటికే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్‌ఎంఎంఎస్)ను అమలు చేస్తుండగా, తాజాగా వేతన చెల్లింపుల్లోనూ కొత్త విధానాన్ని ఫిబ్రవరి 1 నుంచి అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం ఉపాధి కూలీల జాబ్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేస్తోంది. ఉపాధి కూలీలకు ప్రస్తుతం బ్యాంక్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా కూలీలకు వేతనాలు చెల్లిస్తున్నారు. కొందరికి రెండేసి చొప్పున జాబ్‌కార్డులు ఉండటంతోపాటు మరికొందరు పనులకు హాజరుకాకున్నా.. హాజరవుతున్నట్లుగా పేర్లు నమోదు చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడయింది. ఈ క్రమంలో వేతనాల చెల్లింపుల్లో పారదర్శకత పాటించేందుకు కేంద్రం ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక నుంచి ఆధార్ లింకైన బ్యాంక్, పోస్టల్ బ్యాంక్ ఖాతాల్లో మాత్రమే కూలి డబ్బులు జమకానున్నాయి. పబ్లిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ (పీఎఫ్‌ఎంఎస్) ద్వారా డబ్బులు ఎక్కడికి వెళుతున్నాయనేది నేరుగా కేంద్రం పర్యవేక్షించే వెసులుబాటు ఉంటుంది.

జిల్లాలో 96 శాతం ఆధార్ అనుసంధానం

జిల్లాలో జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటివరకు 96 శాతం జాబ్‌కార్డులకు ఆధార్‌తో లింక్ చేశారు. ఈ ప్రక్రియలో గడిచిన మూడేళ్లుగా ఉపాధి పనులకు యాక్టివ్‌గా వస్తున్న కూలీల జాబ్‌కార్డులనే మొదట లింక్ చేస్తున్నారు. ఆ తర్వాత మిగిలిన వారికి కూడా అవకాశం కలిస్తారు. రెండింటిలో కూలీల పేర్లు, చిరునామా వంటి వివరాలు సరిపోకపోవడంతోనే కొన్ని తిరస్కరిస్తున్నారు. అలా తిరస్కరణకు గురైన వాటిని అధికారులు అప్రూవల్ కోసం పెండింగ్‌లో ఉంచారు. వాటిని మళ్లీ అథెంటికేషన్ కోసం పంపనున్నారు.

జాబ్‌కార్డుల అనుసంధానం..

జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల పరిధిలో 2,24,359 కుటుంబాలు ఉపాధి హామీ జాబ్‌కార్డులు కలిగి ఉన్నాయి. వాటి పరిధిలో 4,94,267 మంది కూలీలు పేరు నమోదు చేసుకున్నారు. ఇందులో 2,33,465 మంది కూలీలు యాక్టివ్ వర్కర్లు కొనసాగుతున్నారు. ఇందులో ఇప్పటివరకు 2,30,422 మంది వివరాలు ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేయగా, 2,13,481 మంది పేర్లు ఆమోదం పొందాయి. ఇంకా 16,941 ఆమోదం పొందాల్సి ఉంది.

వందశాతం పూర్తి చేస్తాం



జిల్లాలో ఉపాధి కూలీలు జాబ్ కార్డుతో ఆధార్ అనుసంధాన ప్రక్రియ దాదాపు చివరి దశకు చేరుకుంది. త్వరలోనే వందశాతం పూర్తి చేస్తాం. ఇప్పటివరకు 96 శాతం పూర్తయింది. ఆధార్‌తో అనుసంధానం అయితేనే కూలీలకు వేతనాలు చెల్లిస్తారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 1 నుంచే అమల్లోకి తెచ్చింది.

–జి.మధుసూదన్‌రాజు, డీఆర్డీఓ

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచ: మండలంలోని శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి)లో శుక్రవారం అమ్మవారికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో దేవస్థానం అర్చకులు, అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నెల 5న చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.రజినికుమారి తెలిపారు.

గిరిజన విద్యార్థికి డాక్టరేట్

చర్ల: చర్ల మండలానికి చెందిన గిరిజన విద్యార్థికి డాక్టరేట్ దక్కింది. మండలంలోని కొయ్యూరు గ్రామపంచాయతీ పరిధి రామాంజపురానికి చెందిన ఎలగల సందీప్ 'కొత్త అయస్కాంత పదార్థం తయారీ, లక్షణాల పరిశీలన' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.నతానియేల్ పర్యవేక్షణలో డాక్టరేట్ పూర్తిచేసిన సందీప్‌ను పలువురు స్థానికులు అభినందించారు.



సందీప్

నర్సరీలపై శ్రద్ధ చూపాలి



అశ్వారావుపేటరూరల్: నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు



దమ్మపేట: మాట్లాడుతున్న డీఆర్డీఓ, పక్కన డీపీఓ రమాకాంత్

డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్

అశ్వారావుపేట రూరల్/దమ్మపేట: హరితహారం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసే నర్సరీలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, డీపీఓ లక్కినేని లక్ష్మీ రమాకాంత్ సూచించారు. శుక్రవారం వారు అశ్వారావుపేట మండలంలోని అశ్వారావుపేట, పేరాయిగూడెం, మద్దికొండ, జమ్మిగూడెం, కేశప్పగూడెం, వినాయకపురం, ఊట్లపల్లి, దమ్మపేట మండలంలోని మందలపల్లి, గున్నేపల్లి గ్రామాల్లో పర్యటించారు. నర్సరీలు, డంపింగ్‌యార్డులు, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. అనంతరం రెండు మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నీ నర్సరీల్లో 3.30 లక్షల మొక్కలను వచ్చే జూన్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మొలకెత్తని విత్తనాల స్థానంలో కొత్త విత్తనాలను నాటాలని, ఎత్తుగా పెరిగిన మొక్కలకు సపోర్టుగా కర్రలను కట్టాలని చెప్పారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. ప్రతి మండలంలో ఉపాధి హామీ కూలీల సంఖ్యను 1500కు పెంచాలని, 10 రోజుల్లోపు ప్రతి గ్రామంలోనూ తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అందరూ ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని, ఈ–గ్రామ్ ఇన్సూరెన్స్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓలు చంద్రశేఖర్, విద్యాధరరావు, ఎంపీఓలు కృష్ణ, సీతారామరాజు, ఏపీవోలు సుధాకర్, నరేష్, సర్పంచ్‌లు అట్టం రమ్య, నార్లపాటి సుమతి, భవాని, కొమరం బాబూరావు, మొడియం సత్యవతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

11 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షల షెడ్యూల్ విడుదలైందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌ఎస్‌ఎస్.ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని, డ్రాయింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం ఉంటాయని పేర్కొన్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ పరీక్షలు ఈ నెల 11 నుంచి ఉదయం, మధ్యాహ్నం వేళల్లో మొదటి, రెండో పేపర్ల పరీక్షలు ఉంటాయని, టైలరింగ్, ఎంబ్రాయిడరీ హయ్యర్ గ్రేడ్ పరీక్షలు 12న ఉదయం, మధ్యాహ్నం మొదటి, రెండో పేపర్లు, 13న మూడో పేపర్, 14న నాలుగో పేపర్ పరీక్షలు ఉంటాయని వివరించారు. అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం పరీక్షలు రాయాలని, వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి గేట్-2023

సుజాతనగర్: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలకు, ఎంటెక్, పీహెచ్‌డీ ప్రవేశాలకు కోసం జరిపే గేట్-2023ను శని, ఆదివారాల్లో అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ పరీక్ష రెండు సెషన్లలో జరగనుంది. శనివారం ఉదయం సెషన్లో 73 మంది, మధ్యాహ్నం సెషన్లో 79 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం సెషన్లో 111 మంది, మధ్యాహ్నం సెషన్లో 68 మంది హాజరుకానున్నారు. ఉదయం పరీక్షకు ఉదయం 8 గంటల నుంచి, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2.30 గంటల నుంచి విద్యార్థులను అనుమతిస్తామని నిర్వాహకులు తెలిపారు.

కంటి వెలుగు సక్రమంగా నిర్వహించాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శిరీష



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష అన్నారు. శుక్రవారం ఆమె అశ్వారావుపేట, వినాయకపురం, గుమ్మడవల్లి, బచ్చువారిగూడెం, పేరాయిగూడెం గ్రామాల్లో పర్యటించారు. పేరాయిగూడెం, బచ్చువారిగూడెం, అశ్వారావుపేట కంటి వెలుగు శిబిరాలను సందర్శించారు. కంటి పరీక్షలు, సౌకర్యాలను పరిశీలించి లోపాలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కంటి వెలుగు శిబిరాల ద్వారా ఇప్పటివరకు 3,482 మందికి కంటి పరీక్షలు చేసినట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం గుమ్మడవల్లి పీహెచ్‌సీలో లబ్ధిదారుకు కేసీఆర్ కిట్‌ను అందించి, ఆస్పత్రి రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆ తర్వాత ఆత్మహత్యకు పాల్పడిన దమ్మపేట పీహెచ్‌సీ కాంట్రాక్టు ఉద్యోగి పొట్టా మధు(40) మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి పోస్టుమార్టం గదిలో సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి కుటుంబీకులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు రాందాస్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఉన్నారు.

అభివృద్ధి పథకాలపై ఆరా..



స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

టేకులపల్లి: నేషనల్ లెవెల్ మానిటరింగ్ (ఎన్‌ఎల్ఎం) బృందం సభ్యులు శుక్రవారం టేకులపల్లి మండలంలో పర్యటించి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వివరాలు తెలుసుకున్నారు. వీరు జిల్లాలోని నాలుగు మండలాల్లో పర్యటించనుండగా ఇప్పటికే జూలూరుపాడు మండలంలో తిరిగారు. సభ్యులు శుక్రవారం టేకులపల్లి మండలం బొమ్మనపల్లి, సులానగర్ గ్రామ పంచాయతీల్లో బృందం ప్రతినిధులు నాగరాజు, వీరన్న పర్యటించి ఉపాధి హామీ కూలీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. శనివారం మండలంలోని బద్దుతండా, బోడు గ్రామ పంచాయతీల్లో పర్యటించనున్నారు. ఆదివారం ఇల్లెందులో, సోమ, మంగళవారాల్లో పినపాక మండలంలో పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీఓ దుద్దుకూరి బాలరాజు, ఏపీఓ కాళంగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన 'ఎస్‌పీఎల్' టోర్నీ

'సాక్షి' మీడియా ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ సౌజన్యంతో వారం రోజులుగా జరుగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ శుక్రవారం ముగిసింది. సీనియర్స్ విభాగంలో ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్, జూనియర్స్ విభాగంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్లు విజేతలుగా నిలిచాయి. అలాగే, వరుసగా రెండు విభాగాల్లో కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కాలేజీ, బొమ్మ డిప్లొమా కాలేజీ జట్లు రన్నరప్‌గా నిలవగా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు.

– ఖమ్మం స్పోర్ట్స్

– 8లో...



మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్, పక్కన సుధాకర్ పైప్స్ ప్రతినిధి రవిశంకర్, సాక్షి ఉద్యోగులు

క్లుప్తంగా

కేజీన్నర గంజాయి పట్టివేత


నిందితులను చూపుతున్న పోలీసులు

టేకులపల్లి: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను టేకులపల్లి పోలీసులు పట్టుకున్న ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. టేకులపల్లి పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తడికలపూడి క్రాస్‌రోడ్డు వద్ద గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఏలేటి ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ భూక్యా శ్రీనివాస్ వివరాలు తెలిపారు. మండలంలోని స్టేషన్ తడికలపూడి గ్రామానికి చెందిన బానోత్ ప్రభాస్ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. పాల్వంచలోని తన బంధువు వద్దకు వెళ్లి వస్తున్న క్రమంలో అక్కడ ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతడి ద్వారా గంజాయికి అలవాటు పడ్డాడు. పాల్వంచలోనే వాటర్ సరీ్వసింగ్ వద్ద పని చేస్తున్న అన్వర్‌ఖాన్‌తో పాటు మరో బాలుడితో పరిచయం ఏర్పడి గంజాయి సేవిస్తుండేవాడు. స్టేషన్‌తడికలపూడి సమీపంలో కొందరు యువకులకు ప్రభాస్ గంజాయి విక్రయిస్తుండే వాడు. పాల్వంచకు చెందిన ఇద్దరు ప్రభాస్‌కు గంజాయి తెచ్చి ఇస్తుండేవారు. ఈ క్రమంలోనే శుక్రవారం పాల్వంచకు చెందిన ఇద్దరు సుమారు కేజీన్నర గంజాయి తీసుకుని టేకులపల్లికి వచ్చి ప్రభాస్‌కు ఇస్తున్న క్రమంలో పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురి వద్ద నుంచి కేజీన్నర గంజాయి, మూడు మొబైళ్లు స్వాధీనం చేసుకున్నామని, ఒకరిని జువైనల్ కోర్టుకు, ఇద్దరిని ఇల్లెందు కోర్టుకు తరలించామని సీఐ వివరించారు.

తల్లిపై కుమారుడు, కోడలు దాడి

దమ్మపేట: కన్నతల్లిని అసభ్య పదజాలంతో దూషించిన కుమారుడు, అతడి భార్య.. అంతటితో ఆగకుండా తీవ్రంగా దాడి చేసి గాయపర్చారు. ఈ ఘటన మండలంలోని మల్కారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అత్తి కొండమ్మ, కొన్ని పామాయిల్ మొక్కలను తమ ఇంటి సమీపంలో గల రైతులకు ఇచ్చింది. ఈ కారణంగా జనవరి నెల 30వ తేదీన ఆమె కుమారుడు అత్తి నాగార్జున, అతడి భార్య వెంకటలక్ష్మి.. కొండమ్మను అసభ్య పదజాలంతో దూషించి భౌతిక దాడికి పాల్పడారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ఆటో చోరీ

అశ్వాపురం: మండలంలోని నెల్లిపాక గ్రామంలో పర్శబోయిన నాగరాజుకు చెందిన ఆటోను గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన ఘటన శుక్రవారం చోటుచుసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. నాగరాజుకు చెందిన టీఎస్28 టీ2806 నంబర్ గల ఆటోను రోజూ లాగే తన ఇంటి ఎదుట నిలిపాడు. తెల్లవారేసరికి ఆటో కనిపించలేదు. చోరీకి గురైందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ జితేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాంట్రాక్టు ఉద్యోగి ఆత్మహత్య



మధు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన పొట్టా మధు (40) దమ్మపేట పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌ఏగా పన్నెండేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. కాగా, వేతనాలు సక్రమంగా రాకపోవడం, వచ్చిన వేతనం సరిపోకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆయన గురువారం అర్ధరాత్రి ఇంట్లోనే నిద్రమాత్రలు మింగాడు. శుక్రవారం ఉదయం మృతి చెందినట్లుగా కుటుంబీకులు గుర్తించారు. ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ ఆధ్వర్యాన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మధు కుటుంబానికి కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ గొంది వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. వేతనాలు ఇవ్వకపోవడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించకపోవడమే మధు ఆత్మహత్యకు కారణమని తెలిపారు. కార్యక్రమంలో పి.కృష్ణమ్మ, వెంకటేశ్వరరావు, రాజు, శ్రీనివాస్, శంకర్, విజయ్‌రాజు, నర్సింహారావు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

అశ్వారావుపేటరూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై శుక్రవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ కథనం మేరకు.. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన ఆవుల ప్రసాద్‌కు రమాదేవితో ఐదేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా కొంతకాలంగా అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. దీనిపై రమాదేవి చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుతో ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

ఎస్‌పీఎల్ విజేతలు..
ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్, శ్రీచైతన్య

- రన్నరప్‌గా కేఎండీసీ, బొమ్మ కాలేజీ జట్లు
- ట్రోఫీలు అందజేసిన కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- విజయవంతంగా ముగిసిన 'సాక్షి' ప్రీమియర్ క్రికెట్ టోర్నీ

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఖమ్మం స్పోర్ట్స్: 'సాక్షి' మీడియా ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ కంపెనీ సౌజన్యంతో వారం రోజులుగా ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల, సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ శుక్రవారం ముగిసింది. ఈమేరకు హోరాహోరీగా సాగిన ఫైనల్స్‌లో సీనియర్స్ విభాగం నుంచి ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల, జూనియర్స్‌లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్లు విజేతలుగా నిలిచాయి. ఇక రన్నరప్‌గా కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల, బొమ్మ డిప్లొమా కాలేజీ జట్లు నిలిచాయి. ఈమేరకు విజేతలతో పాటు రన్నరప్ నిలిచిన జట్లకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆతర్వాత కలెక్టర్ గౌతమ్‌తో పాటు సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, టేబుల్ టెన్నిస్ సంఘం జిల్లా కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి, సీనియర్ క్రీడాకారులను జోజిచాకో, ఫారుఖ్‌ను సాక్షి ఉద్యోగులు ఘనంగా కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహనకృష్ణ, బ్యూరో ఇన్‌చార్జ్ బొల్లం శ్రీనివాస్, టీ.వీ. ప్రతినిధి పి.మహేందర్, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల పీడీ డాక్టర్ బి.వెంకన్న, సాక్షి యాడ్స్ మేనేజర్ ఎన్.శేషు, ఈవెంట్ మేనేజర్ బోడపట్ల వేణు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజుతో పాటు ఉద్యోగులు నెల్లూరి ఉపేందర్, జుజ్జూరు ఉపేందర్, గుడిసె రాంబాబు, ఏ.వీ.రామారావు, కె.శ్రీనివాస్, ఆసిఫ్, శ్రీనివాసాచారి, జి.సతీష్, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


సీనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, తదితరులు


జూనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, తదితరులు

క్రీడాకారులకు ప్రోత్సాహం

– రవిశంకర్, సుధాకర్ పైప్స్ ప్రతినిధి

వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహించడంలో తాము ఎల్లవేళలా ముందు నిలుస్తామని సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ రీజినల్ సేల్స్ మేనేజర్ రవిశంకర్ తెలిపారు. అలాగే క్రీడల్లో రాణించే వారికి అండగా ఉంటున్నట్లు చెప్పారు.

హోరాహోరీగా ఫైనల్స్

SPL
SAKSHI PREMIER LEAGUE

- సీనియర్స్ విభాగంలో ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల(ఖమ్మం) – కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల(ఖమ్మం) జట్ల మ్యాచ్‌లో ఫైనల్స్ జరగగా టాస్ గెలిచిన కవిత కాలేజీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత పది ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 64 పరుగులు చేయగా, జట్టులో లోకేష్ 14 పరుగులు చేశాడు. ఇక ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ బౌలర్లు రాజేష్, దీపక్ రెండేసి వికెట్లు తీసుకున్నారు. ఆతర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ జట్టు తొమ్మిది ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈజట్టులో అఖిల్ 16, విశాల్ యాదవ్ 13, విఘ్నేష్, సాయిచంద్ 11 చొప్పున పరుగులు చేయగా, కవిత కాలేజీ బౌలర్లలో ఫరీద్ రెండు, లోకేష్ ఒక వికెట్ పడగొట్టారు.

SUDHAKAR
PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY
Regional Sponser

- జూనియర్స్ విభాగంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల(ఖమ్మం) – బొమ్మ డిప్లొమా కళాశాల(ఖమ్మం) జట్ల మ్యాచ్ హోరాహోరీగా సాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీ చైతన్య జట్టు పది ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 98 పరుగులు చేయగా జట్టులో జయంత్ మూడు ఫోర్లతో 27, గౌతమ్ నాలుగు ఫోర్లతో 23 రన్స్, విఘ్నేష్ 17 పరుగులు సాధించారు. బొమ్మ కళాశాల బౌలర్లలో సైదులు రెండు, ఉదయ్, సాగర్ ఒక్కో వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేసిన బొమ్మ కళాశాల పది ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసినా తృటిలో ఓడిపోయింది. ఈ జట్టులోనవీన్ ఆరు ఫోర్లతో 41 పరుగులు, బషీర్ 13, ముసాకీర్ 11 పరుగులు చేశారు.

'సాక్షి' సేవలు అభినందనీయం

– గౌతమ్, ఖమ్మం జిల్లా కలెక్టర్


కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను సన్మానిస్తున్న 'సాక్షి' ఉద్యోగులు

సాక్షి మీడియా గ్రూప్ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. ప్రజాసమస్యలను వెలికితీయడంలో కీలకపాత్ర పోషిస్తుండడమే కాక... విద్యార్థుల కోసం పోటీ పరీక్షలు, పేద మహిళల ఉపాధికి శిక్షణ ఇవ్వడంలో ముందు నిలుస్తోందని తెలిపారు. ఇదే తరహాలో వర్ధమాన క్రీడాకారులను వెలికితీసేందుకు క్రికెట్ టోర్నీ నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఇలాంటి టోర్నీలు ఔత్సాహిక క్రికెటర్లకు ప్రోత్సాహకరంగా ఉంటాయని.. భవిష్యత్‌లో మరిన్ని టోర్నీలు జరిపేలా 'సాక్షి' యాజమాన్యం కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.


సీనియర్స్ రన్నరప్‌గా నిలిచిన కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల జట్టు


జూనియర్స్ రన్నరప్‌గా నిలిచిన బొమ్మ డిప్లొమా కళాశాల జట్టు

డ్రైడే–ఫ్రైడేను పక్కాగా నిర్వహించాలి


నర్సరీ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

చుంచుపల్లి: డ్రైడే–ఫ్రైడేను ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పక్కాగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ విద్యాలత పంచాయతీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం డ్రైడే–ఫ్రైడేను పురస్కరించుకొని మండలంలోని నందాతండా, చుంచుపల్లితండా, బాబూక్యాంపు, వెంకటేశ్వరకాలనీ, విద్యానగర్‌కాలనీ, ప్రశాంతినగర్ గ్రామ పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు పారిశుద్ధ్య పనులను చేపట్టాలని, అలాగే పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా హరిత నర్సరీలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రతి హాబిటేషన్‌లో తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సకినాల రమేశ్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఏపీఓ రఘుపతి, ఈసీ నాగరాజు, టీఏలు ఆస్మా, అనిల్, పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచాలి

ఇల్లెందురూరల్: నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా నర్సరీలలో మొక్కలు పెంచాలని జెడ్పీ సీఈఓ విద్యాలత సూచించారు. మండలంలోని బాలాజీనగర్, సుభాష్‌నగర్ గ్రామపంచాయతీల నర్సరీలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. నర్సరీలలో పెంచుతున్న మొక్కల వివరాలు తెలుసుకొని సంచులలో మొలకల శాతాన్ని పరిశీలించారు. ముందుస్తుగా నిర్దేశించిన విధంగా అవసరమైన మొక్కలను విధిగా నర్సరీలలో పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పాయం స్వాతి, వల్లాల మంగమ్మ, ఎంపీఓ చిరంజీవి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సల్లంగ సూడు తల్లి..!

కరకగూడెం: ఆదివాసీల ఆరాధ్య దైవం వనదేవతలు శ్రీ సమ్మక్క–సారలమ్మ చిరుమళ్ల జాతర శనివారంతో చివరి అంకానికి చేరుకోనుంది. గురువారం రాత్రి సమ్మక్క–పగిడిద్దరాజుల కల్యాణాన్ని వైభవంగా పూజారులు నిర్వహించారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం అమ్మవార్లు తిరిగి వనప్రవేశంతో జాతర ముగియనున్నడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తిరుగుప్రయాణానికి సిద్ధమయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు చందా లింగయ్యదొర, అధ్యక్షులు చందా భిక్షపతి, సభ్యులు చందా భూపతయ్య, చందా వీరయ్య, స్థానిక సర్పంచ్ పాయం నర్సింహారావు, పూజారులు, ఆదివాసీ గట్ల తలపతులు తదితరులు పాల్గొన్నారు.


కరకగూడెం: తిరుగు ప్రయాణంలో భక్తులు

ముగిసిన జాతర

చర్ల: నాలుగు రోజుల పాటు అత్యంత వైభవంగా కొనసాగిన సమ్మక్క సారమ్మ జాతర శుక్రవారం ముగిసింది. నాలుగు రోజుల పాటు కొనసాగిన ఈ జాతర మహోత్సవానికి ఇటు తెలంగాణ అటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం ఉదయం అమ్మవార్లకు గంగాస్నానం ఆచరింపజేసిన ఆలయ పూజారులు భక్తుల దర్శనార్థం గద్దెలపై ఉంచారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. జాతరలో చివరి రోజు కావడంతో అమ్మవార్లను దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలిరావడంతో పరిసరాలు కిటకిటలాడాయి. మేళతాళాలు, డప్పువాయిద్యాలు, గిరిజన నృత్యాల నడుమ సమ్మక్క తల్లిని గుండంతోగు గుట్టకు, సారలమ్మ తల్లిని సోములదేవమ్మగుట్టకు సాగనంపారు. ఆలయ పూజారి పూనెం సమ్మయ్య నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు, వడ్డెలు, దళపతులు అమ్మవార్లను ఎదిరగుట్ట వద్ద నుంచి సమ్మక్క సారలమ్మ గద్దెల నుంచి సాగనంపారు.

నేటితో ముగియనున్న శ్రీ సమ్మక్క–సారలమ్మ చిరుమళ్ల జాతర


చర్ల: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

బెల్ట్ దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

జూలూరుపాడు: మండల కేంద్రంతోపాటు కొమ్ముగూడెం గ్రామాల్లోని బెల్ట్ షాపులపై శుక్రవారం కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు రావడంతో కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ సీసీ రాజు, ఎస్‌ఐ గౌతమ్ సిబ్బందితో కలిసి జూలూరుపాడు, కొమ్ముగూడెం గ్రామాల్లోని బెల్ట్ షాపులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. జూలూరుపాడులో మూడు బెల్ట్ షాపులు, కొమ్ముగూడెంలో ఒక బెల్ట్ షాపుపై దాడులు చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. నాలుగు బెల్ట్ షాపుల నిర్వాహకులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ఎక్సైజ్‌శాఖ అధికారులకు అప్పగించారు.

జెన్‌కో స్థలంలో మళ్లీ చెలరేగిన మంటలు

పాల్వంచ: పట్టణంలోని బీసీఎంరోడ్‌లో సంజయ్‌నగర్‌లోని జెన్‌కో స్థలంలో చెత్త కుప్పలకు నిప్పు అంటుకోవడంతో మళ్లీ మంటలు చెలరేగాయి. గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటిస్తుండటంతో మంటలు తరచూ లేస్తున్నాయి. భారీ ఎత్తున పొగ కమ్ముకుంటుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జెన్‌కోకు చెందిన సుమారు 5 ఎకరాల స్థలం ఖాళీగా ఉండగా ఆ స్థలంలో జెన్‌కోకాలనీ నుంచి వెలువడే చెత్త, నవభారత్ వైపు నుంచి కూడా చెత్త బండ్లు అక్కడికి వచ్చి డంప్ చేస్తున్నాయి. దీంతో ఆ స్థలం చుట్టూ భారీ ఎత్తున చెత్త పేరుకుపోతోంది. ఈ చెత్తకు గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగగా, కేటీపీఎస్‌కు చెందిన నాలుగు ఫైర్ ఇంజన్‌లు వచ్చి ఆర్పివేశాయి. శుక్రవారం మళ్లీ మంట పెట్టడంతో మంటలు అధికంగా వ్యాపించడమేగాక, దట్టమైన పొగ కమ్ముకుంది. దీంతో పొగకు స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సమాచారం అందుకున్న కేటీపీఎస్ ఫైర్ ఇంజన్‌లు నాలుగు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశాయి. మున్సిపాలిటీ, జెన్‌కో అధికారులు ఖాళీ స్థలంలో ఉన్న చెత్తను వెంటనే తొలగించాలని, అక్కడ చెత్త వేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మండుతున్న చెత్త

విద్యుత్ కోతలపై సబ్‌స్టేషన్ ముట్టడి


సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

చర్ల: అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నందున వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ ఇవ్వాలనే డిమాండ్‌తో రైతులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. మండలంలోని సత్యనారాయణపురంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన సత్యనారాయణపురం, పెద్దిపల్లి, జెట్టిగూడెం, కలివేరు, లింగాల, ఆర్.కొత్తగూడెం, కుదునూరు తదితర గ్రామాల రైతులు ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ అప్రకటిత విద్యుత్ కోతలతో వరితోపాటు మిర్చి పంటలు సైతం దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాపై అబద్ధాలు చెబుతూ రైతులను మోసం చేయొద్దని హితవుపలికారు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఏడీఈ వేణు అక్కడికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఒడిశా నుంచి మహారాష్ట్ర..

- రూ.21లక్షల విలువైన గంజాయి తరలింపునకు యత్నం
- ఇల్లెందులో ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన స్మగ్లర్లు
- ఆపై విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎక్సైజ్, పోలీసు అధికారులు

ఇల్లెందు: ఒడిశా రాష్ట్రంలో తక్కువ ధరకు ఎండు గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలించే క్రమంలో ముగ్గురు స్మగ్లర్లు పలు చెక్‌పోస్టులను దాటగా అప్రమత్తమత్తమైన ఎక్సైజ్, పోలీసు సిబ్బంది అడ్డుకునే యత్నం చేశారు. అయినా ఆగకుండా ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను ఢీకొట్టి వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో వాహనం, స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని రూ.21లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సినిమా తరహాలో శుక్రవారం ఉదయం సాగిన ఈ చేజింగ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నుంచి ఇల్లెందు వరకు సాగింది. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ తిరుపతిరావు, ఇల్లెందు పోలీసు డీఎస్పీ ఎస్.వీ.రమణమూర్తి, సీఐ బి.రాజు, ఎక్సైజ్ వి.రాజశేఖర్‌రావు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్ర సోలాపూర్ ప్రాంతానికి చెందిన సాగర్, శివాజీ, రాంబాబు ఒడిశాలో కిలో గంజాయి రూ.6 వేల చొప్పున 3.50 క్వింటాళ్లు కొనుగోలు చేసి ఐదు కిలోలుగా ప్యాక్ చేసి స్వస్థలానికి తరలిస్తున్నారు. ఒడిశా నుంచి భద్రాచలం చెక్‌పోస్టు మీదుగా ఇన్నోవా వాహనం వస్తోందన్న సమాచారంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అప్రమత్తమై శుక్రవారం తెల్లవారుజామున తనిఖీలు చేపట్టారు. అయితే, భద్రాచలంలో వాహనాన్ని అడ్డుకునేందుకు యత్నించగా తప్పించుకోవడంతో పాల్వంచ, టేకులపల్లి, ఇల్లెందు పోలీసులను అప్రమత్తం చేయడమే కాక వెంబడిస్తూ వచ్చారు. వాహనంలో స్మగ్లర్లు పాల్వంచ దాటి ఇల్లెందుకు చేరుకోగా బారికేడ్లు అడ్డుగా పెట్టడంతో అక్కడ ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుల్స్ బాబా, యాకూబ్‌ల్లో బాబాను ఢీకొడుతూ ముందుకు వెళ్లారు. దీంతో వాహనాన్ని చేజింగ్ చేస్తూనే యాకూబ్ స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇంతలోనే కొత్త బస్టాండ్ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కారు ఆగడంతో వెనుకాలే వస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ యాకూబ్, పోలీసులు, స్థానికులు కలిసి ముగ్గురిని బంధించారు. కాగా, మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ సాగర్‌తో పాటు శివాజీ, రాంబాబును అదుపులోకి తీసుకుని రూ.21 లక్షల విలువైన 3.50 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలిస్తామని అధికారులు వెల్లడించారు.

నంబర్ కూడా నకిలీదే...

స్మగ్లర్లు గంజాయి తరలిస్తున్న ఇన్నోవా వాహనం మహారాష్ట్రలో రిజిస్ట్రేషన్ అయినట్లు తెలుస్తుండగా, నంబర్ మాత్రం ఏపీ 31 బీఏ 1154గా అమర్చారు. ఈనంబర్‌కు ఏపీకి చెందిన ఓ ఆటోదిగా పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన పట్టుబడొద్దనే భావనతో ఇలా చేసినట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పక్కాగా అందిన సమాచారంతో భద్రాచలం నుంచి ఇల్లెందు వరకు చేజ్ చేయగా.. కానిస్టేబుల్ ఢీకొట్టి మరీ ముందుకు వెళ్లిన స్మగ్లర్లు ఎంతకు తెగించారో అర్థమవుతోంది. కాగా, గంజాయిని స్వాధీనం చేసుకోకపోతే మహారాష్ట్రలో అమ్మి రూ.70 లక్షల మేర సంపాదించే వారని చెబుతున్నారు.


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయిన ఇన్నోవా

మెడిలైఫ్ హాస్పిటల్
RTC బస్టాండ్ ఎదుట, భద్రాచలం.
Cell: 7036206111.
ప్రతినెల మొదటి ఆదివారం 05-02-2023 నాడు వచ్చు వైద్య నిపుణులు
డా॥ సీత, MD, DM న్యూరో ఫిజీషియన్ (మైగ్రేన్ తల నొప్పి, మూర్ఛ (ఫిట్స్), పక్షవాతం)
డా॥ పి. రాహుల్, MD, DM నెఫ్రాలజిస్ట్ (డయాలసిస్, కిడ్నీ సంబంధిత)
డా॥ బాబురావు ఎరుకు, MD (Pulmonology) ఆయాసం, క్షయ & ఊపిరితిత్తుల వ్యాధి నిపుణులు

నీలా నర్సింగ్ హోమ్
Old LIC రోడ్, భద్రాచలం.
08743-235959, 9502900991, 9849831060
05-02-2023న వచ్చు ప్రత్యేక వైద్య నిపుణులు
డా॥ ఆర్. బాలాజీ, MD
కార్డియాలజిస్ట్

సాక్షి క్లాసిఫైడ్స్

Education

FREE TRAINING
■ పేద అమ్మాయిలకు హైదరాబాద్ కూకట్‌పల్లి లో ఫ్రీ వసతితో 120డేస్ ఫ్రీ-ట్రైనింగ్, HR+ కమ్యూనికేషన్ + కంప్యూటర్ లర్నింగ్, ప్రాక్టీస్ తర్వాత వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆదాయం-మంచి భవిష్యత్తు. స్మార్ట్ ఫోన్ మస్ట్: 9032944447. [HA-5585]

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్రదించండి: 96590 57777. [M-8914]
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786648]

Wanted
■ మా సర్వీస్ నందు ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలంలలో పని చేయుటకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ టెక్నీషియన్స్ కావలెను. సంప్ర॥ 8074489455. [M-1190517]
■ హైదరాబాద్, వెస్ట్ మారేడుపల్లిలో దాక్షరమ్మ గారి ఇంటిలో వంట చేయుటకు ఆడవారు కావలెను. వయస్సు : 45 సం॥ల పైన. వివరాలకు సంప్ర. సెల్ : 98484 25642. [M-8907]
■ ఖమ్మం సిటీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు, హౌస్‌కీపింగ్, ఫీల్డ్ ఆఫీసర్స్, మార్కెటింగ్ మేనేజర్లు కావలెను. సంప్ర॥ 9069234678 [Y-772740]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779876]
■ Wanted wellness / Health advisors for international wellness company. You can earn Rs. 50,000/- PM in a year. Qly: 10th and above, from KMM Local only. Cont: 63015 56064. [M-1190566]
■ Need Marketing Executives / Managers to meet Schools for book Publishers Salary 15000 -30000/ PM Call:8919641609 [H-793268]
■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ J.Group కంపెనీ హైదరాబాద్‌లో పని చేయుటకు ఉత్సాహవంతమైన యువకులు కావలెను. Age: 18 to 30, సాలరీ: 14,000 to 40,000/- + కమీషన్. Qualification: 10th, ఇంటర్, డిగ్రీ. ఫోన్: 9666688883. [HA-717]
■ విజయవాడలోని ప్రముఖ కలర్ ల్యాబ్ నందు పనిచేయుటకు అన్ని మండలాల వారీగా Marketing Managers కావలెను. 2 వీలర్ మస్ట్ జీతం లేదా కమీషన్. సంప్ర. ✆ 96401 83872, 99088 16888 [B-941]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించ చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు:
ఖమ్మం : 9010299957
9705444182

క్లుప్తంగా...



గోదావరిలో పుష్కర ఘాట్ వద్ద మొసలి

మొసలితో కలవరం

బాల్కొండ : నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ వద్ద గోదావరిలో వీఐపీ పుష్కర ఘాట్ వద్ద శుక్రవారం పెద్ద మొసలి కనిపించింది. దీంతో భక్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అటవీ అధికారులు స్పందించి వెంటనే గోదావరిలో మొసళ్లను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

అవకాశమిస్తే పాలకుర్తి నుంచి పోటీ చేస్తా..

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



తొర్రూరు: వచ్చే ఎన్నికల్లో పార్టీ అవకాశమిస్తే పాలకుర్తి నుంచి పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని టీచర్స్ కాలనీలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొండా మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే పాలకుర్తి నియోజకవర్గంలో ఎర్రబెల్లిపై పోటీ చేస్తానని తెలిపారు. ఈనెల 9న పాలకుర్తి దేవస్థానంలో పూజలు నిర్వహించి.. కార్యకర్తల అభీష్టం మేరకు నియోజకవర్గంలో కార్యక్రమాలు ప్రారంభిస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

క్రమబద్ధీకరణ హామీపై హర్షం

సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్టు ఉద్యోగుల సేవల క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతుందని గవర్నర్ తమిళిసై అసెంబ్లీలో ప్రకటించడాన్ని కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ స్వాగతించారు. ప్రభుత్వం క్రమబద్ధీకరణ జీవో జారీ చేసినా ఇంతవరకూ అమలు కాలేదని గుర్తు చేశారు.

బిల్లును ఓకే చేయించి.. అవిశ్వాసాలు ఆపేలా..!

- పురపాలికల్లో 'లొల్లి'కి చెక్‌పెట్టేందుకు సర్కారు ప్రయత్నాలు
- మేయర్లు, చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానానికి కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ గత అసెంబ్లీలో తీర్మానం
- సదరు బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్
- ఇదే అదనుగా పురపాలికల్లో అవిశ్వాస తీర్మానాల నోటీసులు
- గవర్నర్ ద్వారా బిల్లు ఆమోదింపజేసి వాటిని ఆపాలని ప్రభుత్వ యోచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో నెలకొన్న అవిశ్వాసాల గందరగోళానికి తెర దించాలని ప్రభుత్వం భావిస్తోంది. జనవరి 26తో మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకొన్న 127 పట్టణ, నగర పాలక మండళ్లలో చాలా చోట్ల లుకలుకలు బహిర్గతమయ్యాయి. పలుచోట్ల ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్లపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు కూడా ఇచ్చారు. కొన్ని పట్టణాల్లో క్యాంపులు, కొనుగోళ్ల పర్వం కూడా మొదలైంది. అవిశ్వాసాలు ప్రతిపాదించిన పట్టణాలు, నగరాల్లో అధికార బీఆర్‌ఎస్ పాలక మండళ్లే కొలువు తీరి ఉండటం, ప్రస్తుత మేయర్లు, చైర్‌పర్సన్లను గద్దె దించేందుకు సొంత పార్టీ ప్రతినిధులే అవిశ్వాసం నోటీసులు ఇవ్వడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే రంగంలోకి దిగింది. పట్టణ, నగర పాలక మండళ్లలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఉన్న కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ గత అసెంబ్లీ సమావేశాల్లో తీసుకొచ్చిన బిల్లు ఆమోదం పొందితే మరో ఏడాది వరకు సమస్య ఉండదని భావిస్తోంది. రెండు, మూడు రోజుల్లో మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం లభించేలా పావులు కదుపుతోంది.

ఇన్నాళ్లుగా పెండింగ్‌లో..

తెలంగాణ మున్సిపల్ చట్టం- 2019 ప్రకారం నగర, పురపాలక సంఘాల్లో మేయర్/ డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్ పర్సన్/వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించేందుకు.. పాలక మండలి ఏర్పాటైన నాటి నుంచి కనీసం మూడేళ్ల గడువు పూర్తయి ఉండాలి. ఈ నిబంధనకు సవరణ చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అవిశ్వాస కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ మున్సిపల్ చట్టం సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. అసెంబ్లీ ఆమోదించినా గవర్నర్ వద్ద పెండింగ్‌లో పడింది. రాష్ట్ర ప్రభుత్వానికి, రాజ్‌భవన్‌కు మధ్య ఏర్పడిన అగాథం నేపథ్యంలో గవర్నర్ వద్ద ఆగిన ఏడు బిల్లుల్లో మున్సిపల్ చట్ట సవరణ బిల్లు కూడా ఉంది. మరోవైపు రాష్ట్రంలోని పుర/నగర పాలక సంస్థల పాలక మండళ్లకు గత నెల 26తో మూడేళ్ల పదవీకాలం పూర్తయింది. ఇదే అదనుగా అసమ్మతి ప్రజాప్రతినిధులు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇవ్వడం మొదలుపెట్టారు. అవన్నీ కలెక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈలోపే చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందితే సమస్యకు చెక్‌పడుతుందని సర్కారు భావిస్తున్నట్టు సమాచారం.

రాజ్‌భవన్‌తో సయోధ్య కుదిరిన నేపథ్యంలో..

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఉన్నతస్థాయిలో కుదిరిన సయోధ్య నేపథ్యంలో.. గవర్నర్ తమిళిసై శుక్రవారం అసెంబ్లీలో ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ క్రమంలోనే గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న చట్ట సవరణ బిల్లులకు ఆమోదం పొందేలా ప్రభుత్వ వర్గాలు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. మున్సిపల్ చట్ట సవరణ బిల్లు విషయమై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ గవర్నర్‌ను కలవాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ బిల్లు విషయంలో గవర్నర్‌కు ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసి ఆమోదించాల్సిందిగా కోరాలని భావిస్తున్నట్టు తెలిసింది.

జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసులు

జనగామ: జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్‌పై అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు శుక్రవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి అవిశ్వాస నోటీసులు అందజేశారు. తొమ్మిది రోజులపాటు క్యాంపు రాజకీయం నడిపించిన అధికార పక్షం ఆ ఇద్దరిని తొలగించాలని కోరుతూ 11 మంది బీఆర్‌ఎస్, 8 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు వేర్వేరుగా అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. ఫ్లోర్‌లీడర్ మారబోయిన పాండును తొలగించాలని అధిష్టానాన్ని కోరినట్లు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తెలిపారు. కాంట్రాక్టర్లు, ఇళ్లనిర్మాణ అనుమతులకు కమీషన్లు వసూలు చేస్తూ పార్టీని అప్రతిష్టపాలు చేస్తుండటంతో అవిశ్వాసం నోటీసులు ఇచ్చినట్లు చైర్‌పర్సన్ రేసులో ఉన్న 19వ వార్డు సభ్యురాలు బండ పద్మ తెలిపారు. కాగా, నలుగురు బీజేపీ సభ్యులు కూడా తమతో టచ్‌లో ఉన్నారని ఆమె చెప్పారు.



ఏసీకి అవిశ్వాస ప్రకటన అందిస్తున్న అధికార, ప్రతిపక్ష సభ్యులు

క్షమాపణ చెప్పకుంటే జైలుకే..

న్యాయవాది బాలముకుంద్‌పై ధిక్కార కేసులో హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: న్యాయమూర్తికి షోకాజ్ నోటీసు జారీ చేసినందుకు న్యాయవాది బాలముకుంద్‌రావుపై కోర్టు ధిక్కార కేసు నమోదైంది. బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే జైలుకు పంపిస్తామని చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం ముకుంద్‌రావును హెచ్చరించింది. టూరిజం శాఖను సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ పి.మాధవిదేవి కోర్టు హాల్లో జడ్జితోపాటు ఇతర న్యాయవాదులతో ఆయన పరుషంగా మాట్లాడారు. పైగా కేసుకు సంబంధించి వారం రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ న్యాయమూర్తికి నోటీసులిచ్చారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం బాలముకుంద్‌రావుపై క్రిమినల్ ధిక్కార చర్యలు చేపట్టి విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా ఏజీ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఘటన జరిగిన తర్వాత కూడా న్యాయమూర్తికి క్షమాపణ చెప్పలేదన్నారు.

రాజకీయ రిజర్వేషన్లు చట్టబద్ధం చేయాలి

సాక్షి, న్యూఢిల్లీ: బీసీ ప్రధానమంత్రి మోదీ హయాంలోనే బీసీ లకు 27 శాతం రాజకీయ రిజర్వేషన్లను చట్టబద్ధం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. ఆయన ఢిల్లీలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 75 ఏళ్లుగా అగ్రవర్ణాలు, కార్పొరేట్ శక్తు లు తీవ్ర వివక్షకు గురిచేయడంతో చేతివృత్తుల వారు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి ఢిల్లీ కేంద్ర కమిటీ కన్వీనర్ ప్రకాష్ వర్మ పాల్గొన్నారు.



అసెంబ్లీని సందర్శించిన జర్మనీ ఎంపీల బృందం. చిత్రంలో పోచారం, కేటీఆర్ తదితరులు

అసెంబ్లీకి జర్మనీ బృందం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభను శుక్రవారం జర్మనీ బృందం సందర్శించింది. జర్మనీ, ఇండియన్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్‌లో భాగంగా రాష్ట్రాన్ని సందర్శించిన జర్మనీ పార్లమెంట్ సభ్యుల బృందం శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావుతో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యాపార అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు తదితర అంశాలను మంత్రి జర్మనీ బృందానికి వివరించారు. సమావేశంలో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జి జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి జర్మనీ బృంద సభ్యులను శాలువా, మెమెంటోతో సత్కరించారు.

నేడు బుర్రవీణ.. మధుర గానం

బుర్రవీణకు చిట్టచివరి చిరునామా దాసరి కొండప్ప

- ఇండో–ఫ్రెంచ్ సంగీత కచేరీలో పాల్గొననున్న నారాయణపేట కళాకారుడు
- మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కార్యక్రమం

నారాయణపేట: నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్పకు శనివారం హైదరాబాద్‌లో జరిగే ఓ సంగీత కచేరీలో ఫ్రెంచ్ కళాకారుడు అజరక్ అలెగ్జాండ్రా జురైన్‌తో కలిసి పాల్గొనే అవకాశం వచ్చింది. ఇన్‌స్టిట్యూట్ ఫ్రాంకైస్, అలైన్స్ ఫ్రాంకైస్ ఆఫ్ హైదరాబాద్, స్టేట్ ఆర్ట్ గ్యాలరీల సంయుక్త ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. జురైన్ 25 ఏళ్లుగా భారతీయ సంగీతాన్ని శాంతినికేతన్ కేంద్రంగా అభ్యసించారు. జురైన్ తంత్రి వాదకుడు. డప్పు, డిడ్‌గిరిడో అనే ఊదే వాద్య నిపుణుడు.

రాగాలాపనలో దిట్ట

కొండప్ప జానపద సంగీతకారుడైనప్పటికీ అనేక రకాల రాగాలను ఆలపించడంలో దిట్ట. జానపదం , శాస్త్రీయ సంగీత రంగంలో అతనొక అద్భుత కళాకారుడు. కడుపేద స్థితిలో జీవిస్తున్నా సంగీతాన్నే నమ్ముకున్నాడు. సంగీతం అతని వృత్తి కాగా.. ప్రవృత్తి గానం. ఆకలితో అలమటిస్తున్నా.. శక్తి లేకపోయినా ఆ వాద్యమే.. ఆ రాగాలే అతని అపురూప స్నేహితులు. బుర్రవీణ వాద్యాన్ని అద్భుతంగా వాయించే చిట్టచివరి కళాకారుడు ఆయనే కావడం.. ఆ వాద్యం అతనితోనే అంతరించిపోతుండడం బాధాకరం. విల్లాడి వాద్యం, భూమి వీణ వంటివి ఇంకా గిరిజనుల్లో బతికి ఉన్న మూల సంగీత వాద్య అవశేషాలు. అలాంటి కోవకు చెందినదే బుర్రవీణ వాయిద్యం. కొండప్పకు కళాకారుల కోటా పింఛను రావడం లేదు. భిక్షాటన చేస్తూ తత్వ గీతాలు, కథలు చెబుతూ బతుకు బండిని అతికష్టంగా లాగుతున్నాడు.



బుర్రవీణ వాయిస్తున్న దాసరి కొండప్ప


భద్రాద్రిలో నిత్యాన్న దానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న సిబ్బంది

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఎన్‌ఆర్‌ఐ దంపతులు నగదు విరాళంగా అందజేశారు. ఈమేరకు అజ్జ రపు సురేంద్రశర్మ-సంధ్య శుక్రవారం రూ.51,116ను ఆలయ అధికారులకు అందించగా వారు ప్రత్యేక పూజలు చేయించి, రశీదు అందజేశారు.

ప్రభుత్వ శిక్షణతో ఉద్యోగాలు సాధించాలి



మాట్లాడుతున్న డీడీ రమాదేవి

భద్రాచలం: నిరుద్యోగులైన గిరిజన అభ్యర్థులు ప్రభుత్వ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని భద్రాచలం ఐటీడీఏ డీడీ రమాదేవి సూచించారు. ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవనంలో ఎస్‌ఐ, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల ఉచిత శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. మొత్తం 300 మందికి రెండు నెలల పాటు నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ ఇప్పిస్తుండగా, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు పౌష్టికాహారంతో పాటు ఉచిత వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎంఓ రమణయ్యతో పాటు అధికారులు నర్సింహారావు, సర్వేశ్వర్‌దొర, సతీశ్, వెంకటేశ్వరరావు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొనుగోళ్లు.. సోమవారం సెలవు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు శనివారం కొనసాగుతాయని ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం తెలిపారు. అయితే, లింగమంతుల జాతర సందర్భంగా సోమవారం మార్కెట్‌కు సెలవు ప్రకటించిన నేపథ్యాన.. రైతులు ఇబ్బంది పడకుండా శనివారం సాధారణ సెలవు అయినా కొనుగోళ్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఆది, సోమవారం సెలవుల అనంతరం మంగళవారం నుంచి అన్ని పంటల కొనుగోళ్లు జరుగుతాయని తెలిపారు.

జిల్లా వార్తలు

'కళాతపస్వి'తో జ్ఞాపకాలెన్నో...

- పలుసార్లు ఉమ్మడి జిల్లాకు వచ్చిన దర్శకుడు విశ్వనాథ్
- వివిధ సంస్థల ఆధ్వర్యాన సన్మానాలు



2018లో ఖమ్మంలో విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న వనం కృష్ణవేణి, తదితరులు

ఖమ్మం గాంధీచౌక్/భద్రాచలం: భిన్న కథాంశాలతో సినిమాలు తీసి అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకున్న దర్శక దిగ్గజం, కళా తపస్వి కాశీనాథుని విశ్వనాథ్‌కు ఖమ్మంతో ప్రత్యేక అనుబంధం ఉంది. వృద్ధాప్యంతో గురువారం రాత్రి ఆయన మృతి చెందగా జిల్లా ప్రేక్షకులు, అభిమానులు విశ్వనాథ్‌తో అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ సంతాపం ప్రకటించారు. విశ్వనాథ్ పద్మశ్రీ అవార్డు పొందిన సందర్భంగా 2002లో చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో బెల్లంకొండ బాబాజీ, రంగస్థల నటి వనం కృష్ణవేణి తదితరుల ఆధ్వర్యాన ఖమ్మంలో ఘనంగా సన్మానించారు. అప్పుడు సతీసమేతంగా వచ్చిన ఆయన మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. అలాగే, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు పొందిన సందర్భంగా 2018లో వనం కృష్ణవేణి తదితరులు విశ్వనాథ్‌ను ఖమ్మంలో సత్కరించి ప్రస్తుత ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బహూకరించిన స్వర్ణకంకణాన్ని తొడిగారు. ఈ సందర్భంగా బ్రాహ్మణసంఘం వారు కూడా కళాతపస్విని సత్కరించారు. కాగా, ఆయన మృతిపై ఖమ్మంకు చెందిన నటుడు నాగబత్తిని రవి, రిటైర్డ్ లెక్చరర్ కలివెల పద్మజ, సామాజిక వేత్త డాక్టర్ కడవెండి వేణుగోపాల్, కవి, రచయిత అట్లూరి వెంకటరమణ తదితరులు సంతాపం ప్రకటించారు.

'భద్రాద్రి' రామయ్యకు పూజలు

ప్రముఖ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ పలుమార్లు భద్రాచలం వచ్చారు. ఈక్రమంలో రామాలయాన్ని దర్శించి పూజలు చేశారు. తొలిసారి 2003లో భద్రాచలానికి చెందిన భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యాన నిర్వహించిన నాటకోత్సవాల హాజరైనప్పుడు శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం 2004లో సాయికుమార్ హీరోగా నటించిన 'శ్లోకం' చిత్రం షూటింగ్ సందర్భంగా కూడా భద్రాచలం వచ్చారు. ఈ చిత్రాన్ని భద్రాచలం, పరిసర ప్రాంతాలైన సారపాక, బూర్గంపాడు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించగా సాయి కుమార్ తండ్రిగా విశ్వనాథ్ నటించారు.



విశ్వనాథ్‌కు జ్ఞాపిక ఇస్తున్న రిటైర్డ్ లెక్చరర్ పద్మజ



విశ్వనాథ్‌తో సామాజికవేత్త వేణుగోపాల్



విశ్వనాథ్‌తో కళాభారతి అధ్యక్షుడు నాగేశ్వరరావు

అసెంబ్లీలో మనోళ్లు..



మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య. చిత్రంలో మంత్రి హరీశ్‌రావు







అసెంబ్లీ సమావేశాల సందర్భంగా హాల్‌లోకి వెళ్తున్న కొత్తగూడెం, అశ్వారావుపేట, వైరా, ఇల్లెందు, భద్రాచలం ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, లావుడ్యా రాములునాయక్, బానోతు హరిప్రియ, పోదెం వీరయ్య

ఆలయ నిర్మాణానికి రూ.3లక్షల విరాళం



నగదు అందజేస్తున్న యజమానులు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం సీతారామపురంలో శ్రీ సీతారామచంద్ర మూర్తి స్వామి ఆలయ నిర్మాణానికి గాను గ్రానైట్ పరిశ్రమల యజమానులు రూ.3లక్షల విరాళం ప్రకటించారు. ఈమేరకు ఆరెంపుల, బారుగూడెం, కొక్కిరేణి, సీతారామపురం గ్రామాల్లోని గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఈ విరాళాన్ని శుక్రవారం ఆలయ కమిటీ బాధ్యులకు అందజేశారు. యజమానులు వేముల రవికుమార్, మల్లెల శ్రీనివాసరావు, తీగల విజయ్, నల్ల శ్రీనివాసరెడ్డి, కొనకంచి శ్రీనివాసరావు, భాస్కర్, పణికుమార్, గోపాలరావు పాల్గొన్నారు.

తపాలా పథకాల్లో పరిమితులు పెంపు

- తాజా బడ్జెట్‌లో వెల్లడించిన కేంద్రప్రభుత్వం
- ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్

ఖమ్మంగాంధీచౌక్: కేంద్రప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తపాలా పథకాలకు సంబంధించి ప్రజలకు మరింత లాభం జరిగేలా నిర్ణయాలు తీసుకుందని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ వెల్లడించారు. ఈమేరకు శుక్రవారం వివరాలను వెల్లడించిన ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు.

- నెలవారీ ఆదాయ పథకంలో(ఎంఐఎస్) సింగిల్ ఖాతాకు అత్యధిక పరిమితి రూ.4.50 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు, జాయింట్ ఖాతాకు రూ.9 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పెంచారు. వడ్డీరేటు 6.7 శాతంగా నిర్ణయించారు.
- సీనియర్ సిటిజన్ సేవింగ్స్ పథకంలో ఇప్పటి వరకు ఉన్న అత్యధిక పరిమితి రూ.15 లక్షలను రూ.30 లక్షల వరకు పెంచడమే కాక వడ్డీ రేటు 8శాతంగా నిర్ణయించారు.
- మహిళా బచత్ సమ్మాన్ యోజన(మహిళ, ఆడపిల్లల భవిష్యత్ కోసం) ప్రత్యేక పథకాన్ని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా గరిష్ఠంగా రెండేళ్ల కాలానికి గాను రూ.2 లక్షల వరకు జమ చేసుకోవచ్చు. వడ్డీ రేటు 7.5 శాతంగా నిర్ణయించారు. ఇందులో నుంచి పాక్షికంగా ఉపసంహరించుకునే సౌకర్యం ఉంది.
- ఈ-కామర్స్ బిజినెస్ పెంచడానికి పార్సిల్ బుకింగ్ సెంటర్లు, స్పీడ్ పోస్ట్ హబ్‌లు, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్స్, ఇంటర్నేషనల్ బిజినెస్ సెంటర్లు, డాక్ నిర్యత్ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు.
- నక్సల్ ప్రభావిత ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో తపాలా సేవలను విస్తృతపరిచేలా నూతన పోస్టాఫీసులు ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేశారు.
- కామన్ సర్వీస్ సెంటర్లను పెంచి పీఎం స్వనిధి, ఆయుష్మాన్ భారత్, పీఎం ఎస్‌వైఎం, పీఎం ఎల్‌వైఎం వంటి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇచ్చారు.

జిమ్మిక్కులే తప్ప సంక్షేమం లేదు..

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర బడ్జెట్ మొత్తం రాజకీయ జిమ్మిక్కు తప్ప.. సంక్షేమ పథకాలు, పేదల ఊసే లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఖమ్మం సుందరయ్యభవన్‌లో శుక్రవారం పొన్నం వెంకటేశ్వరరావు అధ్యక్షతన సీపీఎం జిల్లా కమిటీ, మండల కార్యదర్శుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వీరభద్రం మాట్లాడుతూ దేశం ప్రస్తుతం ఆర్థిక ఒడిదుడుకులనే కాక నిరుద్యోగం, ఆరోగ్యం, విద్య తదితర ముఖ్యమైన సమస్యలను బడ్జెట్‌లో ప్రస్తావించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహార సబ్సిడీని 29 శాతానికి తగ్గించగా, మధ్యాహ్న భోజనానికి నిధులు 9.4 శాతం, పౌష్టికాహార పథకాలకు ఏకంగా 38 శాతం తగ్గించారని ఆరోపించారు. నీతి ఆయోగ్ మార్గదర్శకాల ప్రకారం షెడ్యూల్ కులాలు, తెగల సంక్షేమానికి జనాభా దామాషా ప్రకారం కేటాయింపులు తప్పనిసరి అయినా అలా చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఇక దివ్యాంగులు, మైనార్టీల సంక్షేమానికి కూడా బడ్జెట్ తగ్గించారని వీరభద్రం తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు మాచర్ల భారతి, బొంతు రాంబాబు, వె.విక్రమ్, చింతలచెర్వు కోటేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బండి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయండి..



మాట్లాడుతున్న ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలల్లోని విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ ఆదేశించారు. ఐటీడీఏ నుంచి శుక్రవారం ఆయన పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమావేశమై పదో తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాల్సిన తీరుపై సూచనలిచ్చారు. త్వరగా సిలబస్ పూర్తి చేసి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. అలాగే, టెండరుదారులు సరఫరా చేసే వస్తువులు, సామగ్రి నాణ్యతను పరిశీలించాలని చెప్పారు.